నిరాశ్రయులకు దుస్తుల పంపిణీ

నిరాశ్రయులకు దుస్తులను అందజేస్తున్న స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్‌కుమార్

బన్సీలాల్‌పేట్, జూన్ 16 : పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్ల పక్కన ఉంటున్న నిరాశ్రయులు, అనాథలకు దుస్తులను అందజేశారు. అదేవిధంగా అరటి పండ్లు, బిస్కెట్లు, మంచినీళ్ళ ప్యాకెట్లను అందజేశారు. వేసవి కాలంలో నగరంలోని నిరాశ్రయ ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి వారికి ఎక్కడైనా పునరావాసం కల్పించాలన్నారు. స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షురాలు ఓ.పావని తెలిపారు. సభ్యులు హరీశ్, అఖిల్ పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పూజలు

సికింద్రాబాద్ ఎంపీగా కిషన్‌రెడ్డి గెలిచి రెండోసారి కేంద్ర మంత్రి అయిన సందర్భంగా ఆపార్టీ మహంకాళి జిల్లా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆధ్వర్యంలో ఆదివారం సికింద్రాబాద్ నియోజకవర్గంలోని చిలకలగూడ కట్ట మైసమ్మ పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించి 108 టెంకాయలు కొట్టారు. అనంతరం బాణసంచా పేల్చి స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షులు బూర్గుల శ్యాంసుందర్ గౌడ్, పార్టీ నాయకులు హాజరయ్యారు.
– సికింద్రాబాద్,జూన్16

ప్రమాదం జరిగితే.. బాధ్యులు ఎవరు

ట్రాన్స్‌ఫార్మర్లు అంటేనే భయం.. అలాంటి ట్రాన్స్‌ఫార్మర్లకు ఎలాంటి కంచె లేకుండా ఇలా గాలికొదిలేశారు. ఇదేదో మారుమాల ప్రాంతం అనుకుంటే పొరపాటే..సనత్‌నగర్‌లోని మార్కెట్ రోడ్డులో కంచె లేకుండా వైర్లు రోడ్ల పైకి వచ్చేటట్టుగా ఉండడంతో ఆ ప్రాంతం గుండా పోయే పాదచారులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులు అని ప్రశ్నిస్తున్నారు. లష్కర్‌లో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. సికింద్రాబాద్ ఎల్క్ట్రిసిటీ ఏడీఈ విభాగం పరిధిలోని ఎంజీ రోడ్డు, రాష్ట్రపతి రోడ్డు, మోండామార్కెట్, ప్రాంతాల్లోని అంతర్గత, ప్రధాన రహదారుల్లో ఉన్న విద్యుత్ టాన్స్‌ఫార్మర్లకు ఎలాంటి రక్షణ లేకుండా వదిలేశారు. ప్రమాదం జరిగిన తరువాత కంటే ముందే మేల్కొంటే ఎలాంటి ప్రమాదం జరగడానికి ఆస్కారం ఉంటుందని పలువురు విద్యుత్ శాఖ అధికారులను కోరుతున్నారు. – బేగంపేట్

సేవకుడిగా ఉంటూ.. సేవలు అందిస్తా

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్

లేపాక్షి కాలనీలో జరిగిన కాలనీ సమావేశంలో ఎమ్మెల్యే శ్రీ గణేష్‌కు పూల బోకేను అందజేస్తున్న కాలనీ వాసులు

మారేడ్‌పల్లి/బొల్లారం ,జూన్ 16: ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ... నాయకుడిగా కాకుండా సేవకుడిగా ప్రజలకు సేవలను అందిస్తానని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ అన్నారు. ఆదివారం మోండా డివిజన్ మారేడ్‌పల్లి లేపాక్షి కాలనీలో కాలనీ వైస్ ప్రెసిడెంట్ రామారావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు వ్యాయామం చేసుకోవడానికి షెడ్‌ను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా కాలనీలో ఒక ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వివరించారు. లేపాక్షి కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, షెడ్ నిర్మాణం, ట్రాన్స్ ఫార్మర్‌ను త్వరలో ఏర్పాటు చేస్తానని ఈ సందర్భంగా కాలనీ వాసుకు ఎమ్మెల్యే శ్రీ గణేష్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి నరసింహ, కోశాధికారి ప్రకాశ్, నాయకులు బద్రినాథ్ యాదవ్, సి. సంతోష్ యాదవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

కంటోన్మెంట్ ఎనిమిదో వార్డు పరిధిలోని వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ రెసిడెన్సీ ఆఫ్ సరస్వతీనగర్ కాలనీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కాలనీ వాసులు నాలా,సీసీ రోడ్ల సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సీఎం రేవంత్ రెడ్డి,జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో ప్రత్యేక నిధులు కేటాయించి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జయ ప్రకాష్,కాలనీ అధ్యక్షుడు సత్యనారాయణ,ప్రధాన కార్యదర్శి సాయిబాబా,సలహాదారుడు శ్రీనివాస రావు,కాలనీ వాసులు పాల్గొన్నారు.

రక్తదానం దాతలకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న శిబిరం నిర్వాహకులు

గాంధీనగర్‌లో స్వచ్ఛందంగా రక్తదానం

బన్సీలాల్‌పేట్, జూన్ 16 : తలసీమియా వ్యాధిగ్రస్తుల కోసం గాంధీనగర్ కాలనీ కమ్యూనిటీ హాలులో ఆదివారం స్వచ్ఛందంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. గాంధీనగర్ కాలనీ అసోసియేషన్, సికింద్రాబాద్ సహకారంతో టీమ్ పారస్ సేవ, డయాగ్నోస్టిక్ లీడర్స్, మేవాడ్ నవయువక్ మండల్, ఏవీకే మిత్ర బృందం, హెల్దీ లైఫ్ మై బర్త్ రైట్, జేసీఐ హైద్రాబాద్ రాయల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో చేసిన 200 యూనిట్ల రక్తాన్ని తలసీమియా సికిల్ సెల్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ వారికి అందజేశారు. అనంతరం రక్త దాతలకు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ శిబిరంలో ముఖ్య నిర్వాహకులు రోహిత్, సతీశ్, నితిన్, జగదీశ్ కుమార్, ప్రకాశ్, వలంటీర్లు, గాంధీనగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీ రమణ, ప్రధాన కార్యదర్శి పి.రవికాంత్, కోశాధికారి మోహన్‌రావులు పాల్గొన్నారు.

గురుద్వార్‌లో ఎంపీ ఈటల ప్రత్యేక ప్రార్థనలు

మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా అత్యధిక మెజార్టీతో గెలుపొందిన ఈటల రాజేందర్ ఆదివారం సికింద్రాబాద్‌లోని గురుద్వార్ మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా సిక్కు మత పెద్దలు ఎంపీ ఈటల రాజేందర్‌ను శాలువాతో సత్కరించారు. మల్కాజిగిరి ప్రజలందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఈ సందర్భంగా ఈటల రాజేందర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్, బీజేపీ నాయకులు పిట్ల నాగేష్ ముదిరాజ్, హరినాథ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.
– మారేడ్‌పల్లి, జూన్ 16

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

కంటోన్మెంట్ మూడో వార్డు పరిధిలోని మడ్‌పోర్డులో కంటోన్మెంట్ నియోజవర్గం ఇన్‌చార్జి శ్రీకిషన్,రొట్టెల సునీల నేతృత్వంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాకేష్,టీం సభ్యులు మధు, వంశీ, కార్తీక్,పవన్,బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.
– బొల్లారం,జూన్ 16:

భూమిలేని పేదలకు భూమి పంచాలి

చిక్కడపల్లి, జూన్ 16 : భూమిలేని పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి పంచాలని వీసీకే తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ(బొజ్జా తారకం)ఆధ్వర్యంలో ఆ పార్టీ కోఆర్డినేటర్ జన్ను సాంబయ్య అధ్యక్షతన 'భూమిని పంచు, బడ్జెట్ పెంచు' అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిలకర శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణలో అనేక దశాబ్దాలుగా భూమి కోసం పోరాటాలు జరిగాయని, భూ సంస్కరణ చట్టాలు రావడంతో మిగుల భూములు ఏర్పడ్డాయని అన్నారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం భూములను వేలం వేస్తుందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమకారులకు రెండు వందల యాబై గజాల భూమిని ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో హామీ ఇచ్చారని వెంటనే ఆ హామీని అమలు చేయాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

కాలనీలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న కోట నీలిమా తదతరులు

బేగంపేట్ జూన్ 16: సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీ.పీసీసీ కార్యదర్శి సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమా అన్నారు. ఆదివారం బేగంపేట్ డివిజన్‌లోని మోతీలాల్‌నెహ్రూనగర్‌లో పర్యటించి స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు విశాల్ సుదం ఆధ్వర్యంలో కాలనీ వాసులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ క్రమంలో పలు సమస్యలను కాలనీ వాసులు నీలిమా దృష్టికి తీసుకొచ్చారు. కాలనీలో సరైన రోడ్లు లేవని ఉన్న రోడ్లు కూడా దెబ్బతిన్నాయని, అలాగే కాలనీలో పచ్చదనాన్ని పెంపొందించే విధంగా పార్కుల నిర్వహణ సరిగ్గా ఉండేలా చూడాలని కోరారు.

కచ్చితంగా ఈ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గౌర శ్రీనివాస్,ప్రతినిధులు శ్రీనివాస్‌పటేల్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఎంఎస్ఆర్ ట్రస్ట్ చేయూత

స్పీకర్ చేతుల మీదుగా చెక్కులు అందుకున్న విద్యార్థులు

ఖైరతాబాద్, జూన్ 16: పేద విద్యార్థులకు ఎంఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. లక్డీకాపూల్‌లోని ఎస్ఎస్ సెంట్రల్ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ట్రస్ట్ నిర్వాహకులు శివారెడ్డి, శిరీషరెడ్డి చేతుల మీదుగా 300 మంది విద్యార్థులకు సహాయత చెక్కులను అందజేశారు. శివారెడ్డి మాట్లాడుతూ తమ ట్రస్ట్ ద్వారా 10వ తరగతి, ఇంటర్‌లో మంచి మార్కులు వచ్చి పైచదువులు చదువుకోలేని విద్యార్థులకు సహాయం అందిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది 500 నుంచి వెయ్యి మంది విద్యార్థులకు రూ.10వేల సాయాన్ని అందజేస్తున్నామన్నారు. నలుగురికి సహాయం చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.

వ్యర్థాలు బయటపడేయొద్దు

జూబ్లీహిల్స్, జూన్ 16: స్వచ్ఛ నగరంగా ఉంచేందుకు ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి సూచించారు. ఆదివారం జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఇన్‌చార్జి అజారుద్దీన్ ఆధ్వర్యంలో ముస్లింలకు బక్రీద్ కవర్లు పంపిణీ చేశారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా జీవ వ్యర్థాలు బయటపడేయకుండా కవర్లోనే వేయాలని సూచించారు. బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యావేత్త రూప

చిక్కడపల్లి, జూన్16: విద్యార్థులు వచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పలువురు విద్యావేత్తలు అన్నారు. బాగ్ లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో ఎంబీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థుల కోసం ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ప్లేస్మెంట్ డ్రైవ్‌ని ఆదివారం నిర్వహించింది. ప్రముఖ విద్యావేత్త రూప విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వచ్చిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతిభ ఉన్నవారికి తప్పకుండా అవకాశాలు వస్తాయని తెలిపారు. కళాశాల డైరెక్టర్ రిషికాంత్, ప్రిన్సిపాల్ నాగరాజు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ చాగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

డయాలసిస్‌పై అవగాహన

ఖైరతాబాద్: నిమ్స్ దవాఖానలో ఆదివారం హీమో డయాలసిస్‌పై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డైరెక్టర్ డాక్టర్ బీరప్ప సదస్సును ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శాంతివీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బక్రీద్‌ను పురస్కరించుకొని సికింద్రాబాద్‌లోని చిలకలగూడ మైదానంలో , కంటోన్మెంట్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో మేకలు, గొర్రెలను కొనుగోలు చేస్తున్న ముస్లింలు

దివ్యాంగులను ఆదుకునేందుకు కృషి

నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచితంగా కృతిమ పరికరాలు పంపిణీ

దివ్యాంగురాలికి పరికరం అమర్చుతున్న సంస్థ ప్రతినిధులు

ఈడెన్ గార్డెన్‌లో దివ్యాంగులకు పరికరం అమర్చుతున్న ఎంపీ కొండా

హిమాయత్‌నగర్, జూన్16: రాష్ట్రంలోని దివ్యాంగులకు అన్ని విధాలుగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తూ వారికి అండగా నిలుస్తుందని ఎంపీ కొండా విశ్వేశ్వర రెడ్డి, బీజేపీ నాయకురాలు మాధవిలత తెలిపారు. ఉదయ్‌పూర్‌లోని నారాయణ్ సేవా సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం కింగ్‌కోఠిలోని ఈడెన్ గార్డెన్‌లో ఉచితంగా దివ్యాంగులకు కృతిమ అవయవాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రమాదాలు, అనారోగ్యం వల్ల వికలాంగులుగా మారిన వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు సంస్థ ఉచితంగా కృతిమ అవయవాలను అందిస్తున్నదని తెలిపారు. సమాజ సేవ చేయడం అభినందనీయమన్నారు. ఇలాంటి సంస్థలకు కేంద్ర ప్రభుత్వం తరపున ప్రోత్సహించడంతో పాటు సహాయ, సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు.

కార్యక్రమంలో సంస్థాన్ డైరెక్టర్ దేవేంద్ర చౌబిసా, కోఆర్డినేటర్ అల్కాచౌదరి, ప్రతినిధులు జస్మిత్ పటేల్, భగవాన్ ప్రసాద్‌గౌర్, రితేష్ జగీర్ధార్, ప్రశాంత్ అగర్వాల్, నరేంద్రసింగ్ చౌహాన్, ఉత్తమ్ దమ్రాణి అభయ్‌చౌదరి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులు పూర్తి చేయండి

కాచిగూడ కార్పొరేటర్ ఉమా యాదవ్

కాచిగూడ, జూన్ 16: స్థానిక ప్రజల సహకారంతో డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు కాచిగూడ కార్పొరేటర్ ఉమా యాదవ్ అన్నారు. డివిజన్‌లోని మౌలానా ఆజాద్‌నగర్ ప్రాంతంలో ఆదివారం ఆమె పర్యటించి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జల మండలి అధికారులకు సూచించారు.

అనంతరం, ఆమె మాట్లాడుతూ మౌలిక సదుపాయలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్నె రమేశ్ యాదవ్, సుభాష్ పటేల్, సాయి, నాగరాజు, కిరణ్, సంతోష్, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న యూసుఫ్

హిమాయత్‌నగర్, జూన్ 16: రాష్ట్రంలోని మైనార్టీ రెసిడెన్సియల్ స్కూల్స్‌లో విధులు నిర్వహిస్తున్న నాన్ టీచింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఉద్యోగుల రాష్ట్ర సదస్సు జరిగింది. వారు మాట్లాడుతూ మైనార్టీ రెసిడెన్సియల్‌తో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్సియల్ స్కూళ్లలో సుమారు 12వేల మంది నాన్‌టీచింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. కనీస వేతనాలు అమలు చేయకపోవడంతో పాటు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

పురాతన కట్టడాలను పరిరక్షించాలి

నగరంలో ఉన్న పురాతన కట్టడాలను పరిరక్షించాలంటూ ఆదివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో రాయల్ ప్యాలెస్ హెరిటేజ్‌ను పరిశీలిస్తున్న పర్యావరణ వేత్త అనురాధ రెడ్డి బృందం.

పుస్తకాల ఆవిష్కరణ..

చిక్కడపల్లి, జూన్ 16: విమల సాహితీ స మితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ జెల్దీ విద్యాధర్ రచించిన 'అంతరంగపు భా ష', 'తోటమాలి మాలిమి' ఆంగ్ల అనువాద పుస్తకాలు 'వాయిస్ ఆఫ్ సౌల్', 'ద గార్డెన్స్ లవ్' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సిటీ కల్చరల్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. కళారత్న డాక్టర్ బి.కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో పుస్తకాల అనువాదకుడు ఆంగ్ల కవి కొం పాక రవీంద్రాచారి, కవి సాహితీవేత్త ప్రొఫెసర్ జీవీ రత్నాకర్, కవయిత్రి రాధా కుసుమ పాల్గొన్నారు.

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు విద్యాధర్, బిక్కి కృష్ణ